18 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

వికారాబాద్, సెప్టెంబర్ 12 : ఈ నెల 18 నుంచి డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 24వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ పరీక్షల కోసం వికారాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాల కోసం ఏసీజీ రామ్ రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

'అవాయిడ్ ఆల్కహాల్.. ఎంజాయ్ ఫెస్టివల్'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): వినాయక నిమజ్జనంలో కొంతమంది మద్యం తాగి భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దావత్ విత్‌ఔట్ దారు సంస్థ వ్యవస్థాపకుడు చేగొండి చంద్రశేఖర్ అన్నారు. 'అవాయిడ్ ఆల్కహాల్.. ఎంజాయ్ ఫెస్టివల్' థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల నిమజ్జనోత్సవంలో కొందరు మద్యం సేవించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి ఆధ్యాత్మిక వాతావరణానికి ఇబ్బంది కలిగించొద్దంటూ సోషల్ మీడియా వేదికగా 'దావత్ విత్‌ఔట్ దారు' టీం పిలుపునిచ్చింది. డ్యాన్స్‌లు, మ్యూజిక్ పండుగను సంతోషంలోకి తీసుకెళుతుందని, కానీ మద్యం తోడైతే ప్రమాదకరంగా మారుతుందని వివరించారు. పండుగల్లో ఆనందంగా ఉండాలంటే మద్యానికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి..

- సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, ప్రొఫెసర్ హరిసర్వోత్తమన్
- అన్నాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో ముగిసిన 'స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్' కార్యక్రమం

'స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్'లో ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు

కడ్తాల్, సెప్టెంబర్ 12: జీవ వైవిధ్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జనరల్ జియోలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, ప్రొఫెసర్ హరిసర్వోత్తమన్ అన్నారు. మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్' రెండో బ్యాచ్ వారికి నిర్వహించిన అవగాహన కార్యక్రమం గురువారం సాయం త్రం ముగిసింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలలకు చెందిన 66 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరిసర్వోత్తమన్ మాట్లాడారు. భూమిపై వివిధ కారణాలతో జీవ వైవిధ్యం దెబ్బతిన్నదని తెలిపారు. అవగాహనలేమితో జీవ వైవిధ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. జీవ వైవిధ్యం ప్రాముఖ్యత, దానిని ఎలా కాపాడుకోవాలో, తదితర అంశాలను ఆయన సమావేశంలో వివరించారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణం, జీవన విలువలు, నైపుణ్యాలు నేర్పించి, భవిష్యత్ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను దేశరక్షణగా భావించాలని తెలిపారు. భూమిపై నానాటికీ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. భూమిని కాపాడుకుంటూ, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే సీజీఆర్ లక్ష్యమన్నారు. అనంతరం సీజీఆర్ సంస్థ ప్రతినిధులు ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, సీజీఆర్ సభ్యుడు డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, సీజీఆర్ ఆఫీసర్లు అన్నమయ్య, అనుదీప్, నగేశ్, రజనీకాంత్, లక్ష్మీప్రసన్న, హరితాదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఎస్సీ మహిళా నిరుద్యోగులే అర్హులు : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 12: ఎస్సీ మహిళా నిరుద్యోగులు ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులైన షెడ్యూల్డ్ కులాల మహిళలకు కుట్టు మిషన్లతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఉచిత కుట్టు మిషన్ పంపిణీ ద్వారా స్వయం ఉపాధి కల్పనకు మంచి అవకాశం ఉంటుందని అన్నారు. టైలరింగ్ శిక్షణకు కనీస విద్యార్హత 5వ తరగతి చదివి, వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. వికారాబాద్ జిల్లాలో నివసించే నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాల మహిళలకు ఉచిత స్వయం ఉపాధి కోసం 66 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణ వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. శిక్షణ కాలం పూర్తి అయిన తర్వాత ఉచిత కుట్టు మిషన్, సర్టిఫికెట్‌లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, కులం, ఆదాయం, విద్యార్హతల జిరాక్స్‌లు, పాస్‌ఫోటో సైజు (2)లతో వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయం రూం నం.12, రెండవ అంతస్తులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పోరేషన్ కార్యాలయంలో ఈ నెల 20లోగా అందజేయాలన్నారు. ఈ సదవకాశాన్ని ఎస్సీ నిరుద్యోగ మహిళలు వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 08416-255866/9849582036/9398193671లలో సంప్రదించాలన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో రెడ్ రన్

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్(దిశ), జిల్లా వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా గురువారం విక్టోరియా మెమోరియల్ స్కూల్ గ్రౌండ్‌లో రెడ్ రన్ నిర్వహించారు. ఈ రన్‌లో అవినాష్ కాలేజీ(ఎల్బీనగర్), తెలంగాణ రెసిడెన్షియల్ కాలేజీ(ఇబ్రహీంపట్నం), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్(హయత్ నగర్), సిద్ధార్థ ఉమెన్స్ కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతూ.. హెచ్ఐవీ ఎయిడ్స్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండడంతోపాటు ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ రెడ్‌రన్‌లో గెలిచిన విజేతలకు బహుమతులను వారు అందజేశారు.

– రంగారెడ్డి, సెప్టెంబరు 12(నమస్తే తెలంగాణ)

'నిర్మాణ రంగ అనుమతుల జారీని వేగవంతం చేయండి'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): టీజీ బీ పాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ వెరిఫికేషన్ సిస్టం) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లే అవుట్, భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత గడువులో అనుమతులు ఇచ్చే టీజీ బీ పాస్ దరఖాస్తుల పరిష్కార పురోగతిపై సచివాలయం లో గురువారం ప్లానింగ్ అధికారులతో ముఖ్య కార్యదర్శి సమీక్షించారు. టీజీ బీ పాస్ దరఖాస్తుల డిస్పోజల్ వేగంగా చేపట్టాలని దాన కిశోర్ ఆదేశించారు. దరఖాస్తుతో జత చేయాల్సిన ఏవైనా డాక్యుమెంట్లు తక్కువగా ఉంటే ఆ విషయాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేస్తూ తిరిగి అన్ని డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ప్రస్తుత సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు టీజీ బీ పాస్ కింద

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలకు వచ్చిన దరఖాస్తులు వాటి పరిష్కార ప్రగతిపై తనకు నివేదికలు ఇవ్వాలన్నారు.

విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి

వికారాబాద్ అదనపు కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్

తాసీల్దార్ కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్

కొడంగల్, సెప్టెంబర్ 12 : విధుల నిర్వహణలో ఉద్యోగులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక తాసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలోని ఆయా శాఖలను సందర్శించి పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల విధులను అడిగి తెలుసుకున్నారు. ధరణి పోర్టల్‌కోసం వచ్చే దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి.. ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు కోరుతున్న ధ్రువపత్రాలకు సంబంధించి వస్తున్న దరఖాస్తులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న విధులపట్ల సబ్ కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలతోపాటు కస్తూర్బా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెను ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ విజయ్‌కుమార్‌తోపాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

వికారాబాద్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్

పట్లూర్‌లో వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ పల్వన్ కుమార్

మర్పల్లి, సెప్టెంబర్ 12 : రోగుల పట్ల సిబ్బంది సానుకూల దృక్పథంలో ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ అన్నారు.. గురువారం మండలంలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.. రోగులకు అందుతున్న సేవల గురించి మెడికల్ ఆఫీసర్‌ను, పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు.. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.. ఫార్మసీ స్టోర్‌లోని మందులను, ల్యాబోరేటరీని పరిశీలించి.. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చా రు. ప్రజలకు సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.. గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయించాలని సూచించారు. అనంతరం ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, వ్యాక్సిన్ నిల్వ ఉంచు ఫ్రీజర్‌ను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ బుచ్చిబాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయి

చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

బహుమతులు అందుకున్న జట్టుతో పోలీసులు, న్యాయమూర్తులు

చేవెళ్ల టౌన్, సెప్టెంబర్ 12: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ తెలిపారు. సైబరాబాద్ పోలీసుల అధ్వర్యంలో గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 14 జట్లు తలపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు జరగగా.. ఫైనల్‌లో సైబరాబాద్ జట్టు విజయం సాధించగా, దేవుని ఎర్రవల్లి జట్టు ద్వితీయ స్థానం, ఆలూర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులకు న్యాయమూర్తుల చేతుల మీదుగా జ్ఞాపికలతో పాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఖాళీ సమయాన్ని క్రీడల కోసం వినియోగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి బయటి ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి ఇలాంటి టోర్నమెంట్ దోహదపడుతున్నదని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించిన చేవెళ్ల పోలీసులను న్యాయమూర్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సీఐలు భూపాల్ శ్రీధర్, రమేశ్ నాయుడు, ఎస్సైలు శ్రీకాంత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయుడు పరమేశ్వర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసి బీఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పై చేసిన దాడిని ఖండించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్ట్ చేయడం సిగ్గు చేటని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే కాంగ్రెస్ పార్టీ నేరంగా భావిస్తుందని అన్నారు. ప్రజాపాలన పేరుతో ఆ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని అన్నారు. ఇలాంటి చర్యలను కాంగ్రెస్ మానుకోకపోతే బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలో తేల్చుకోవస్తుందని హెచ్చరించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావును వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హైటెక్స్‌లో నేడు ఇండ్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్, సెప్టెంబర్ 12: పరిశ్రమల యంత్ర పరికరాలు, హ్యాండ్ టూల్స్, స్టీల్, పైప్, వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్‌కు మాదాపూర్ హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ శుక్రవారం వేదిక కానుంది. ఇండ్ ఎక్స్ పో 2024 పేరుతో నేడు ప్రారంభం కానున్న కార్యక్రమానికి పలువురు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, వ్యాపారవేత్తలు హాజరుకానున్నారు. ఈ నెల 15 వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో పరిశ్రమలకు చెందిన పలు యంత్ర పరికరాలు, ప్లాంట్స్, మెషినరీ, ఎక్విప్‌మెంట్స్, రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీ, లేజర్ కటింగ్ మెషీన్స్, హ్యాండ్ టూల్స్, మెషీన్ టూల్స్, ఈఆర్‌పీ సాఫ్ట్‌వేర్స్, ఇండస్ట్రీయల్ ఆటోమేషన్, స్టీల్, పైప్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, సొల్యూషన్స్ వంటివి కొలువుదీరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు..

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మర్పల్లి, సెప్టెంబర్ 12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి.. నష్టపోయిన పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.. మండలంలో మినుము, పెసర, కంది, పత్తి, సోయబిన్, వామ పంటలు సాగు చేయగా.. భారీ వర్షాలతో అవి దెబ్బతిన్నాయి. మినుప పంట కోతకు వచ్చే సమయానికి వర్షం కారణంగా పొలాల్లోనే తడిసి మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టం చెల్లించాలని కోరారు. 'నమస్తే తెలంగాణ' ఏవో శ్రీకాంత్‌ను పంటల వివరాలను అడుగగా.. మండలంలోని రైతుల పొలాలను తమ ఏఈవోలు సందర్శించి పరిశీలిస్తున్నారని.. వాటి నివేదికలను పైఅధికారులకు పంపుతున్నామని తెలిపారు..

నర్సాపూర్ తండాలో వర్షానికి దెబ్బతిన్న మినుప పంటను చూపిస్తున్న రైతు

పంట నష్టం అందించాలి

ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.. ఎకరం పొలంలో మినుప పంట సాగు చేశాను.. పంట సాగు చేసినప్పటి నుంచి సరైన సమయంలో వర్షాలు పడటంతో మంచి దిగుబడి వచ్చి మంచి లాభం వస్తది అనుకున్నాను. కానీ గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మినుప పంట మొత్తం పడైపోయి రూ.30 వేల నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి . – బి.సేవ్యా నాయక్, రైతు, నర్సాపూర్ చిన్న తండా, మర్పల్లి

భారత్, ఇరాన్‌ల మధ్య వారధిగా నగరం

ఇరు దేశాల మధ్య పర్యాటక బంధం బలపడాలి

పర్యాటక రోడ్డు షోలో ఇరాన్ డిప్యూటీ టూరిజం మంత్రి షల్బాఫియాన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): భారత్, ఇరాన్‌ల మధ్య పర్యాటక సంబంధాలు మరింత బలపడాలని ఇరాన్ పర్యాటక శాఖ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఇరాన్ పర్యాటక రోడ్ షో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాలుగా ఇరాన్, భారత్ దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక అనుంబంధం ఉందని చెప్పారు. ఇరాన్ పట్ల సానుకూల వాతావరణం ప్రోత్సహించడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా దేశంలో పర్యాటక రోడ్ షోలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్‌తో ఇరాన్‌కు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. రెండు దేశాలను కలిపే వారధిగా హైదరాబాద్ నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ఇరాన్ సాంస్కృతిక సంపద గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి ఇరు దేశాల మధ్య పర్యాటక సంబంధాలు బలోపేతం చేయడానికి రోడ్డు షోలు గొప్ప వేదికగా నిలుస్తాయని చెప్పారు. ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణ ఒక ప్రముఖ గమ్యస్థానంగా నిలిచిందని వివరించారు. పర్యాటకులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వారసత్వ పరిరక్షణ, స్థానిక కళలు, హస్తకళలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, ఇరాన్ కాన్సులేట్ సెకండ్ కన్సుల్ మోహసిన్ మొగద్దమి, షోజేహి, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, హైదరాబాద్ పర్యాటక శాఖాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ సరోజ, డీపీఎం రామ్మూర్తి

బొంరాస్‌పేటలో ఇందిరా మహిళా శక్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీడీ, మహిళా సంఘం సభ్యులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 12 : ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ సరోజ, డీపీఎం రామ్మూర్తి అన్నారు. బొంరాస్‌పేట మండలంలోని బొంరాస్‌పేటలో నాలుగు, తుంకిమెట్లలో ఒకటి, కొత్తూరులో ఐదు, బాపల్లితండాలో రెండు, దుద్యాల మండలంలోని దుద్యాలలో మూడు, లగచెర్లలో ఒకటి, ఈర్లపల్లిలో మూడు ఇందిరా మహిళా శక్తి న్యూ ఎంటర్‌ప్రైసెస్‌లను వారు గురువారం ప్రారంభించారు. వీటి ఏర్పాటుకు డీఆర్‌డీవో ద్వారా ఐకేపీ మహిళలకు రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం రుణాలను అందజేస్తుందని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతినెలా 5లోగా వాయిదాలు చెల్లించి, సకాలంలో రుణాలు చెల్లించాలని, సక్రమంగా రుణాలు చెల్లించినవారికి వడ్డీ తిరిగి వస్తుందని ఏపీడీ సరోజ అన్నారు. ఆయా గ్రామాల్లో ప్రారంభించిన న్యూ ఎంటర్‌ప్రైసెస్‌లను సరళ, రామ్మూర్తి పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి అంభుజ, కోశాధికారి భాగ్యమ్మ, గ్రామ సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, సీసీలు యాదయ్య, సంజీవ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిల్వ.. వ్యక్తి అరెస్టు

వికారాబాద్, సెప్టెంబర్ 12 : గంజాయి నిల్వలపై వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అరెస్టు చేసింది. గురువారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మధ్య నిషేధ, అబ్కారీ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పరిగి పట్టణంలోని బ్రాహ్మణవాడలో గంజాయి నిల్వలు ఉన్నాయని సమాచారం మేరకు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పరిగి పట్టణానికి చెందిన వి.వినోద్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించగా 160 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రేమ్ కుమార్ రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, హనుమంతు, శివ ప్రసాద్, రవి కిరణ్‌లు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్నేషనల్ ఆర్ట్ షో

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): మాదాపూర్, కావూరి హిల్స్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఇంటర్నేషనల్ ఆర్ట్ షో జరగనుందని నిర్వాహకులు గురువారం పేర్కొన్నారు. 200 మంది ఆర్టిస్టులు ఈ షోలో పాల్గొంటున్నారు. 400 పైగా పెయింటింగ్స్ ప్రదర్శనకు ఉన్నాయి. ఆర్టిస్టులతో ముఖాముఖి, పెయింటింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఉండనున్నాయి. ప్రకృతి, ఆధ్యాత్మికం, గ్రామీణ, సిటీ కల్చర్ తదితర విభిన్న రకాల థీమ్స్‌పై పెయింటింగ్స్ ఆలోచన రేకెత్తించనున్నాయి. ఎంపిక చేసిన పలు పెయింటింగ్స్‌నే ఈ ప్రదర్శనలో ఉంచనున్నారు.

పోస్టల్ కమీషన్ పెంచండి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): ఫ్రాంచైజీ పోస్ట్ ఆఫీస్ కమీ